క్లుప్తంగా

ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత సీట్లు

పెనమలూరు: మండల పరిధిలో ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పిస్తామని ఎంఈఓ శేషగిరిరావు తెలిపారు. పెనమలూరులో మంగళవారం ఎంఈఓ శేషగిరిరావు వివరాలు తెలుపుతూ ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లను ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. 2025–26 విద్యా సంవత్సరం నుంచి ఒకటవ తరగతిలో చేరే వారు ఈ నెల 26వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు పరిశీలించిన తర్వాత ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సీట్లు కేటాయింపు జరుగుతుందని వివరించారు. మరిన్ని వివరాలకు మండల విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించండి



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముస్లిం విద్యార్థులకు ఉర్దూ ప్రథమ భాష బోధించడానికి ఉపాధ్యాయుడిని నియమించాలని కోరుతూ మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవికి ముస్లిం పెద్దలు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ఉర్దూ బోధించేందుకు ఉపాధ్యాయుడు లేకపోవడంతో ముస్లిం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సమస్యను విద్యా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ కరీం, షేక్ కాలేషా, ఆదం షఫీ, సాహెబ్ బాబా, షబ్బీర్ అహ్మద్, ఖాదర్, వసీం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యంపై కేసు

పెనమలూరు : వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గోసాల గ్రామానికి చెందిన చాగంటిపాటి కుమార్‌రాజా భార్య, పిల్లలు, తల్లితో కలిసి ఉంటున్నారు. కాగా ఈ నెల 20వ తేదీన అందరూ పనులకు వెళ్లిన తర్వాత తల్లి చాగంటిపాటి గంగాభవాని(64) మందులు కొంటానని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం అనేక ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో వృద్ధురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కానూరులోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పీ హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా కృష్ణనగర్, జెండాచెట్టు, సుబ్బులమ్మ బజార్, రామాలయం, సనత్ నగర్, ఆటోనగర్ టర్మినల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ నిధులు రూ.10 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణం పనులు మంగళవారం ప్రారంభించారు. గ్రామంలోని ఎస్సీ ఏరియాలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి జంక్షన్ వరకు రోడ్డు నిర్మిస్తున్నట్లు పంచాయతీరాజ్ అసిస్టెంటు ఇంజినీరు ఎన్.శివరామకృష్ణ తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో బోడపాడులో సిమెంటు రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు.

25 మంది ఉద్యోగాలకు ఎంపిక

నున్న(విజయవాడరూరల్): వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ పరమేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల నాలుగవ తేదీన కళాశాల ఆవరణలో జరిగిన క్యాంపస్ డ్రైవ్‌లో కియా మోటార్స్ ఇంటర్నేషనల్‌లో 25 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించినట్లు కియా సంస్థ తెలిపిందని చెప్పారు. క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగ అవకాశాలు లభించిన విద్యార్థులను డైరెక్టర్ ఎస్ కీర్తిరెడ్డి అభినందించారు.

అలరించిన వాగ్గేయకారుల సంకీర్తన

విజయవాడ కల్చరల్: కంచి కామకోటి పీఠస్థ శ్రీ వెంకటేశ్వర, శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం కుంచనపల్లి గీతాంజలి పబ్లిక్ స్కూల్ బాల బాలికలు ఆలపించిన వాగ్గేయకారుల సంకీర్తనలు చిన్నారుల ప్రతిభకు అద్దంపట్టాయి. పదకవితా పితామహుడు అన్నమయ్య కీర్తనతోపాటు రామదాసు రచించిన సంకీర్తనలు జ్ఞానానంద మయందేవం, గురుస్తుతి, మహాగణపతిం, పలుకే బంగారమాయన, మాధవా కేశవా మధుసూదనా, జగడపు జనువుల జాజర, నవనీత చోరా తదితర కీర్తనలు చోటు చేసుకున్నాయి. దేవాలయ కార్యక్రమ పర్యవేక్షుడు డాక్టర్ సీ రామ్మోనరావు మాట్లాడుతూ పద కవితకు ఆద్యుడు అన్నమయ్య అని అభివర్ణించారు. ఆయన సంకీర్తనలు తెలుగుదనం నిండి ఉంటాయన్నారు. దేవాలయ మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

ప్రసాదంపాడులో పడకేసిన పారిశుద్ధ్యం

- రోడ్లపై పేరుకుపోతున్న చెత్త
- డ్రైయినేజీల్లో కదలని మురుగు
- దోమలు, విషసర్పాలకు నిలయాలుగా ఖాళీ స్థలాలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ప్రధాన గ్రామంతో పాటు అంతర్గత రహదారుల్లో చెత్త కుప్పలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. అయినా కూడా పంచాయతీ అధికారులకు పట్టడం లేదు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పుకుంటున్న అధికారులు పూర్తి స్థాయిలో సమస్య పరిష్కరించడంలో మాత్రం విఫలమవుతున్నారు. అటు విజయవాడ నగరానికి, ఇటు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామాన్ని నిత్యం పారిశుద్ధ్య సమస్యలు గ్రామస్తులను పట్టి పీడిస్తున్నాయి. గ్రామంలోని పలు అంతర్గత రహదారుల్లో డ్రెయిన్లు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో మురుగునీరు పొంగి రహదారులపైకి చేరుకుంటోంది. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది. అంతర్గత రహదారులతో పాటు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న డ్రెయిన్లు పొంగి ప్రధాన రహదారులపై మురుగునీరు తిష్టవేస్తోంది. ఇందుకు ప్రధాన డ్రెయిన్లు అభివృద్ధికి నోచుకోకపోవడమే ప్రధాన కారణంగా నిలుస్తోంది.

రోడ్లపైనే చెత్త డంపింగ్

చెత్త డంపింగ్ చేయడానికి అనువైన స్థలం కొరత కారణంగా గ్రామంలోని పలు అంతర్గత రహదారుల్లోనే చెత్తను విచ్చలవిడిగా డంప్ చేస్తున్నారు. దీంతో అంతర్గత రోడ్లు, ప్రధాన రహదారులు చెత్త డంపింగ్ కేంద్రాలుగా వెలుస్తున్నాయి. చెత్త కుప్పలు విపరీతంగా పేరుకుపోవడంతో సమీప నివాసితులు, రాకపోకలు సాగించే వారు తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ చెత్త కుప్పలను రోజుల తరబడి ఇలాగే వదిలేస్తుండటంతో వీధి కుక్కలు, పందుల సంచారం పెరిగిపోతోందని స్థానికులు చెబుతున్నారు.

అధికారుల చర్యలు శూన్యం

గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో సంబంధిత పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. వాటర్ ట్యాంక్, సాయిబాబా ఆలయం సమీపం, కాల్వ గట్టు ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయని వాపోతున్నారు. గ్రామంలో పలు లోతట్టు ప్రాంతాల్లో డ్రెయిన్లు పారక మురుగునీరు తిష్టవేస్తోందని చెబుతున్నారు. గ్రామంలో రహదారుల పక్కనే చెత్త డంపింగ్‌లు వెలుస్తున్నా పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లుగా ప్రవర్తిస్తున్నారని విమర్శిస్తున్నారు. నివాసాల మధ్య చెత్త డంపింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి డ్రెయిన్లల్లో పూడిక తీయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ప్రసాదంపాడులోని సాయిబాబా ఆలయ సమీపంలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

డంపింగ్‌యార్డ్ లేదు

సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లు గుర్తించి పూడిక తీయిస్తున్నాం. పలు డ్రెయిన్ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి పారిశుద్ధ్య సిబ్బందిచే బయటకు తరలిస్తున్నాం. గ్రామంలో డంపింగ్‌యార్డ్ లేకపోవడంతో కొంత వరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– రాజేంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, ప్రసాదంపాడు

పారిశుద్ధ్య నిర్వహణ కొన్ని ప్రాంతాలకే పరిమితం

గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి పనులు ప్రధాన ప్రాంతాలకే పరిమితం అవుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ, సెయింట్ ఆన్స్ పాఠశాల రోడ్డు, వాటర్ ట్యాంక్ రోడ్డు, కాల్వ గట్టు ప్రాంతాల్లో సమస్యలు మేట వేసినా అధికారులు, పాలకులకు పట్టడం లేదు. అంతర్గత డ్రెయిన్లలో మురుగు పారుదల ఉండటం లేదు. డ్రెయిన్లు పొంగి నివాసాల మధ్య మురుగునీరు నిల్వ ఉంటున్నాయి. దీనికి తోడు గ్రామంలో విచ్చలవిడిగా ఉన్న ఖాళీ స్థలాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. మురుగు, చెత్త వ్యర్థాలతో నిండిపోవడంతో విషసర్పాలు, దోమలకు నిలయాలుగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖాళీ స్థలాల్లోనే చెత్తను డంప్ చేస్తుండటంతో పారిశుద్ధ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆరోపిస్తున్నారు.

పరీక్షలతో ఆరోగ్యకరమైన పోటీతత్వం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న జిల్లా సివిల్ సప్లయీస్ మేనేజర్ వెంకట సతీష్

కంకిపాడు: పోటీపరీక్షలతో ఆరోగ్యకరమైన పోటీతత్వం నెలకొంటుందని ఎన్టీఆర్ జిల్లా సివిల్ సప్లయీస్ మేనేజర్ తోట వెంకటసతీష్ అన్నారు. ఇంటర్నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్ లెవల్–2 పరీక్షల్లో కంకిపాడు శ్రీ చైతన్య విద్యార్థులు సత్తాచాటారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్థానిక పాఠశాలలో మంగళవారం బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తోట వెంకటసతీష్ మాట్లాడుతూ పోటీ పరీక్షలతో అనుకున్న లక్ష్యాలను సాధిస్తూ, ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. నిత్య సాధన, క్రమశిక్షణ, పట్టుదల ఎంతో అవసరమన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన జి.శ్రీహిత, అబ్దుల్ సమద్‌లు మొదటి స్థానంలో నిలిచి ట్యాబ్‌లను బహుమతులుగా అందుకున్నారు. 214 మంది విద్యార్థులు బంగారు పతకాలను సాధించారు. కాట్ పరీక్షల్లో ప్రతిభచాటిన విద్యార్థులు నగదు బహుమతులు అందుకున్నారు. విద్యార్థులను విద్యాసంస్థల ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ ధీరేంద్ర అభినందించారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి, ఉపాధ్యాయ బృందం పర్యవేక్షించారు.

రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలి



పోరంకిలో ప్రకృతి వ్యవసాయం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతులు

ఏపీసీఎన్ఎఫ్ అధికారి పారిజాతం

పెనమలూరు: రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచరల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) అధికారి జి.పారిజాతం సూచించారు. పోరంకి రైతు సేవా కేంద్రంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల రైతులకు ఖర్చు తగ్గుతుందన్నారు. భూమికి వివిధ రకాల పోషకాలు పెరుగుతాయని, రైతులకు ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం చేకూరుతుందని తెలిపారు. పీఎండీఎస్ విత్తనాలు పొలంలో వేసిన 45 రోజులు తర్వాత భూమిని కలియ దున్నడం వల్ల వివిధ రకాల సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది భూమికి రక్షణగా ఉంటాయని పేర్కొన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల అన్ని విధాల లాభం చేకూరుతుందని వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీఏఏ స్మైలీ, ఎన్ఎఫ్ఏ ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

17 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో ఏటా నిర్వహించే హనుమజ్జయంతి ఉత్సవాలను వచ్చే నెల 17 నుంచి 22వ తేది వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి టీ తారకేశ్వరమూర్తి తెలిపారు. స్థానిక ఏలూరురోడ్డులోని ఆలయ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఆయన పుర ప్రముఖులతో ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆరు రోజుల పాటు నిర్వహించే వివిధ కార్యక్రమాలు, పూజలు, ఉత్సవ పందిళ్లు, విద్యుత్ లైటింగ్, సెట్టింగ్‌ల ఏర్పాటుపై చర్చించారు. సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, పుర ప్రముఖులు వేమూరి శ్రీనివాసరావు, వడ్డి వాసవి, మట్టా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయునికి తమలపాకులతో పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాతలు వడిసెల రాము (ఏలూరు) సహకారంతో 200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



అబ్రహంను సన్మానిస్తున్న పాఠశాల కమిటీ సభ్యులు

పెనమలూరు: సమాజం ఆరోగ్యవంతంగా ఉండాలంటే ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని పారిశ్రామికవేత్త, విద్యాదాత అన్నే శివనాగేశ్వరరావు అన్నారు. కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన గాలి అబ్రహం దంపతులను మంగళవారం సత్కరించారు. శివనాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి సమాజానికి అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంటుందన్నారు. గత 35 ఏళ్లుగా అబ్రహం విద్యార్థులకు అందించిన సేవలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పీ విజయలక్ష్మి, ఉపాధ్యాయ సంఘ నేత కే రెడ్డమ్మ, పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు బొకినాల అజరయ్య, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారం తయారీపై అవగాహన అవసరం



చనుపల్లివారిగూడెంలో గర్భిణులు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్



వణుకూరులో పోషకాహార పక్షోత్సవం ముగింపులో అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనమలూరు: పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలు తల్లులు తెలుసుకోవాలని, తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారు చేసుకునే విధంగా అవగాహన పొందాలని కానూరు సెక్టార్ సూపర్‌వైజర్ జీ విజయలక్ష్మి అన్నారు. కానూరులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార పక్షోత్సవాల ముగింపులో ఆమె పాల్గొని ప్రసంగించారు. అంగన్‌వాడీ కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వణుకూరు, గంగూరు, గోసాల గ్రామాల్లో జరిగిన ముగింపు కార్యక్రమంలో మహిళా కార్యదర్శి ఎం.సుధారాణి పాల్గొని ప్రసంగించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం విధిగా తీసుకోవాలని సూచించారు. పోషకాహారం తీసుకోవడం వల్లనే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణుల భర్తలతో ఆకుకూరల పకోడి, ఆకుకూరల చపాతి, ఇతర ఆహార పదార్థాలు తయారు చేయించి చూపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చనుపల్లివారిగూడెం(గన్నవరం): మండలంలోని చనుపల్లివారిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహార, ఆరోగ్య జాగ్రత్తలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ నాగపద్మావతి వివరించారు. అనంతరం అంగన్‌వాడీలో ఆరేళ్లు నిండిన పిల్లలను ఎంపీపీ పాఠశాలలో చేర్చారు. హెచ్ఎం ఆశీకరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం రోజా, టీ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవారికి విశేష పూజలు, కుంభార్చన, మండలార్చన, నిత్య హోమాలు నిర్వహించారు. సంతానార్థుల కోసం ఆలయంలో పుత్ర కామేష్టి హోమం, ఆర్థిక ఇబ్బందులు, దారిద్ర్య నివారణ, ధనప్రాప్తి కోసం శ్రీమహాలక్ష్మి అమ్మవారి శ్రీసూక్త హోమం, సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం స్వామి వారికి లక్ష మల్లెపూలతో విశేష అర్చన జరిగింది. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. కల్యాణోత్సవంలో మాజీ సర్పంచ్ కాకాని అరుణ, ఆలయ ట్రస్టీలు, దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్ వర్తింపజేయాలి



డైరెక్టర్ శివప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ సభ్యులు

పాయకాపురం(విజయవాడరూరల్): ఏపీ వార్డు విద్య, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులకు సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్ వర్తించేలా ప్రమోషన్లు కల్పించాలని ఏపీ వెడ్స్ జాయింట్ యాక్షన్ కమిటీ డైరెక్టర్ కే శివప్రసాద్‌రెడ్డిని మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. విద్య, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులకు ప్రభుత్వం గతంలో కల్పించిన ప్రమోషన్ ఛానల్‌లో సంక్రమించవలసిన వార్డు పరిపాలన కార్యదర్శి పోస్టులను ఎక్కువ శాతం మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం ద్వారా నియమించడం జరిగిందన్నారు. ఇలా చేయడం ద్వారా వార్డు విద్య, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు చాలా మందికి ప్రమోషన్ రాలేదని తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్ వర్తించేలా ప్రమోషన్లు కల్పించే విషయాన్ని ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో జేఏసీ చైర్మన్ బీ గంటయ్య, కన్వీనర్ జీ యశ్వంత్, కోకన్వీనర్ పీ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

కంకిపాడు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధి పొందాలంటే రేషన్‌కార్డుదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ వీ భావనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రేషన్‌కార్డులోని ప్రతి ఒక్క సభ్యుడు నెలాఖరులోపు ఈ-కేవైసీ చేయించాలని సూచించారు. సంక్షేమ పథకాల లబ్ధికి దోహదపడుతుందని, ప్రజలు గుర్తించాలని కోరారు.

ఘనంగా ధరిత్రీ దినోత్సవం



పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు మంగళవారం ధరిత్రీ(భూమి) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాలేజీలో ఎకోక్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు కాలేజీ నుంచి తాడిగడప జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎకోక్లబ్ కన్వీనర్ డాక్టర్ చాగర్లమూడి కవిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని.. అప్పుడే భూమిని కాపాడుకోగలుగుతామని సూచించారు. పచ్చదనం, పరిశుభ్రతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, క్లబ్ సభ్యులు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసరపల్లిలో చోరీ

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు సుందరయ్యనగర్‌లోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి సుమారు రూ. 20 వేలు నగదు, సెల్‌ఫోన్ అపహరించిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన మాదల కృష్ణ వ్యవసాయ కూలీ పనులు, కౌలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే మంగళవారం తెల్లవారుజామున 3.30 నుంచి 4 గంటల సమయంలో గాఢ నిద్రలో ఉండగా ఇంట్లోకి దొంగలు చొరబడి రూ. 20 వేలు నగదు, సెల్‌ఫోన్‌ను అపహరించుకుపోయారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా కృష్ణ ఇంటి సమీపంలోని సీసీ కెమెరా పుటేజ్ ఆధారంగా చోరీకి పాల్పడింది బైక్‌లపై వచ్చిన నలుగురు యువకులుగా పోలీసులు గుర్తించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు ఎన్డీఏ కృషి

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దయానంద్

గన్నవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జీ దయానంద్ పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ పార్కు కమ్యూనిటీ హాలులో మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ కృషి ఫలితంగానే దేశంలోని అన్ని వర్గాలు రాజ్యాంగ ఫలాలను అనుభవిస్తున్నాయని అన్నారు. అటువంటి మహనీయుడిని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో అవమానాలకు గురిచేసిందన్నారు. అంబేడ్కర్‌పై పోటీ చేసి గెలిచిన వ్యక్తిని పద్మశ్రీ పురస్కారంతో కాంగ్రెస్ సత్కరించిందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంబేడ్కర్‌కు సముచిత స్థానం కల్పించినట్లుగా తెలిపారు. అంబేడ్కర్ జన్మస్థలం, ఢిల్లీలోని ఇంటిని, మరో మూడు ప్రదేశాలను మ్యూజియంగా మార్చుచేసి ఆయన జీవిత చరిత్రను భావితరాలకు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను దుశ్శాలువాలతో సత్కరించారు. బీజేపీ జిల్లా నాయకుడు శేషుకుమార్ నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమ, సర్పంచి నిడమర్తి సౌజన్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజబాబు, నేతలు కపర్థి, వాసిరెడ్డి మనోజ్‌కుమార్, సీహెచ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న పీడీ హరిహరనాథ్

పెనమలూరు: స్వయంశక్తి సంఘాలకు చెందిన మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై హరిహరనాథ్ అన్నారు. పెనమలూరు వెలుగు కార్యాలయంలో మంగళవారం స్వయం సహాయ సంఘాల సభ్యులకు జీవనోపాదుల ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగ గలుగుతారన్నారు. స్వయం ఉపాధికి రుణాలు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. సూర్యఘర్, ఫైనాన్సియల్ మేనేజిమెంట్‌ను వివరించారు. సమావేశంలో ఏరియా కోఆర్డినేటర్ పీక్లా నాయక్, ఏపీఎం జీ కృష్ణంరాజు, స్వయం సహాయ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం



పెద్దఅవుటపల్లి(గన్నవరం): ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లి పశు వైద్యశాలలో మంగళవారం ఎన్టీఆర్ పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత వైద్య శిబిరాన్ని కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బాలకృష్ణ ప్రారంభించారు. అనంతరం 70 వరకు గేదెలు, ఆవులకు గర్భకోశ చికిత్సలు నిర్వహించారు. మరో 400కుపైగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు లక్ష్మీరాణి, కమలాకర్, సుధాకర్‌రెడ్డి, మల్లికార్జున, బిందు కిరణ్మయి, నాగర్జున పాల్గొన్నారు.

శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ వెంకట్వేరస్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం పంచామృతాలతో ఆలయ ప్రధాన అర్చకుడు వినుకొండ రామరత్నచార్యులు శిష్యబృందం అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ, తులసీ దళ అర్చన, పంచహారతుల సేవ నిర్వహించారు. పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.